క్లుప్తంగా

ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని జిల్లా టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్, ఐజేయూ సభ్యులు చంద్ర నరసింహారావు శుక్రవారం ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి వీలైనంత త్వరలో పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని నాయకులు వివరించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఇల్లెందురూరల్: మాణిక్యారం గ్రామంలో వివిధ పార్టీల నుంచి 60 కుటుంబాలు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరాయి. వారికి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, మండల శాఖ అధ్యక్షుడు శీలం రమేష్, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, యలమద్ది రవి, లష్కర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ జీఎంకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో సుమారు 4 ఏళ్లు వివిధ ఏరియాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) ఏ.కుమార్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా జీఎంను ఆయన చాంబర్‌లో సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెంగెర్ల మల్లయ్య, కార్పొరేట్ లైజన్ ఆఫీసర్ మాలకొండయ్య, కలవల చంద్రశేఖర్‌రావు, జిమ్మిడి మల్లేష్, మోరే రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ...

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన పలువురు ఉద్యోగులను శుక్రవారం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు సన్మానించారు. మాట్లాడుతూ.. ఆర్టీసీలో విస్తృత సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు శేషజీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం ఎన్నిక


మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

కొత్తగూడెంఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం 2023–24 సంవత్సరానికి నూతన అధ్యక్షురాలుగా అరుణ, కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా దుర్గారాణిలను ఎన్నుకున్నారు. శుక్రవారం కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో నూతన ఎన్నికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ జిల్లా గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి నూతనంగా ఎన్నికైన వారిని అభినందించారు. అనంతరం అరుణ మాట్లాడుతూ.. మహిళా సాధికారత, బాలికల విద్యపై పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జీవీబీ ప్రసాద్, ఏకేవీ చలం, జె.అబ్రహం, పాపయ్య, ఆనందకుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రూప్‌–4 అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

చుంచుపల్లి: శనివారం జరగనున్న గ్రూప్‌–4 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం నుంచి ఖమ్మం, పాల్వంచ, ఇల్లందు వైపు ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. బస్టాండ్‌లలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


పుస్తకాలు అందజేస్తున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా తెలిపారు. చుంచుపల్లి మండలం గౌతంపూర్‌లో ఎంపీపీ వట్టికొండ మల్లికార్జున్ సతీమణి స్వర్గీయ రజనీకుమారి జయంతి సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాషా మాట్లాడగా.. రుద్రంపూర్ సర్పంచ్ సాగర్, వాసిరెడ్డి మురళి, సలిగంటి శ్రీనివాస్, తోటరాజు, గనిగళ్ల వీరస్వామి, ఉమాయిన్, రాంచందర్, పొనగంటి రాజు, క్రాంతి, చిట్టి, సంపత్ పాల్గొన్నారు.

కోటి ఆశలతో.. వానాకాలం సాగు

తొలకరి వర్షాలు పలకరించడంతో అన్నదాతలు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. గతేడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. రైతులు కొంతమేర నష్టాలను చవిచూశారు. ఈ సారైనా సాగు ఆశాజనకంగా ఉంటుందనే భరోసాతో కోటి ఆశలతో రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటూ విత్తనాలు సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ తరుణంలో విత్తనాల నాణ్యతపై జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికాలు సూచిస్తున్నారు.

- తొలకరి వర్షాలతో పల్లెల్లో సాగు సందడి
- విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు అవసరం
- మెళకువలు పాటించాలంటున్న వ్యవసాయ అధికారులు


పత్తి అచ్చు తోలుతున్న రైతులు

ఇల్లెందురూరల్: జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో ప్రతి సీజన్‌లోనూ నకిలీ విత్తనాలు పట్టుబడుతున్న విషయం తెలిసిందే. సాధారణంగా పత్తి విత్తనాల్లో నకిలీలు అధికంగా విక్రయిస్తుంటారు. గ్రామాల్లో తెల్ల సంచుల్లో, మధ్యవర్తులు విక్రయించే విత్తనాలను ఎట్టి పరిస్థితిలోనూ కొనుగోలు చేయవద్దు. వ్యవసాయశాఖ అనుమతి ఉన్న దుకాణాల్లో, కంపెనీ విత్తనాలనే కొనుగోలు చేయాలి. విత్తనాల ఎంపికకు వ్యవసాయ అధికారుల సూచనలు, తోటి రైతుల అనుభవాలు పరిగణలోకి తీసుకోవాలి. ప్యాకెట్లపై అన్ని వివరాలను పరిశీలించాలి. తప్పనిసరిగా బిల్లులను తీసుకుని భద్రపర్చాలి. ఒకవేళ పంట దెబ్బతిన్నట్లయితే కంపెనీపై కేసు వేసి చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడతాయి.

విత్తన నాణ్యత ముఖ్యం..

బీటీ పత్తి, హైబ్రీడ్ పత్తి రకాలు, హైబ్రీడ్ మొక్కజొన్న, వరి రకాలను, ఇతర పంటల్లోనూ హైబ్రీడ్ రకాలను ప్రతిపంటకూ నూతనంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సూటి రకాలు ముఖ్యంగా వరి, పెసర తదితరాల్లో మాత్రం రైతులు తమ సొంత విత్తనాన్ని ఎన్ని పంటలకైనా వాడుకోవచ్చు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా, పరిశోధన స్థానాల ఆధ్వర్యంలో విత్తనోత్పత్తి చేపట్టిన రైతుల నుంచి తోటి రైతులు వరి విత్తనాలు సేకరించుకోవచ్చు. వరి, పత్తి, మొక్కజొన్న విత్తనోత్పత్తి చేస్తున్న వారు అధికారుల సమక్షంలో ముందస్తు రాతపూర్వకంగా ఒప్పందాలు చేసుకోవాలి. రైతులు పరిశోధన స్థానాలు, ఇతరత్రా వ్యవసాయశాఖ ఇచ్చే నామూనా సంచుల విత్తనాలను తీసుకొని విత్తనాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. విత్తనాలు కనీసం 98 నుంచి 99 శాతం జన్యుస్వచ్ఛత కలిగి ఉండాలి. రాళ్లు, చెత్తచెదారం, తాలు గింజలు, కలుపు మొక్కల విత్తనాలు ఉండకూడదు. ఆరోగ్యవంతమైన పంట నుంచి విత్తనాలను తీసుకోవాలి. పత్తి, మిరపల్లో కనిష్టంగా 60 శాతం, మొక్కజొన్నలో 90 శాతం, వరిలో 80శాతం, పప్పు ధాన్యాల్లో 75శాతం, వేరుశనగలో 70 శాతం మొలకశాతం కలిగి ఉండాలి. రైతులు ఈ నిష్పత్తిని పరిశీలించుకొని విత్తుకోవడం మంచిది.

విత్తన శుద్ధి ఇలా చేయాలి..

పైరుకు బూజు తెగుళ్లు, రసం పీల్చే పురుగులు సోకుతాయి. వీటి నివారణకు విత్తనశుద్ధి తప్పనిసరి. వరి విత్తనాలపై ఆకు ఎండు తెగులు, జొన్న, మక్క విత్తనాలపై కాటుక ఆకుపచ్చ, పచ్చకంకి, ఆకు ఎండు తెగుళ్లకు కారణమైన శిలీంద్రబీజాలు ఉంటాయి. కాబట్టి విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. రసాయనిక శిలీంద్రనాశనులు, క్రిమిసంహారకాలు, నత్రజని స్థిరీకరించే రైజోబియం కల్చర్, జీవసంబంధిత మందులతో విత్తనశుద్ధి చేయాలి. పత్తిలో 1కిలో విత్తనానికి కార్బండిజంతో విత్తనశుద్ధి చేసి జిగురు కలిపి 5గ్రాములు ఇమిడాక్లోప్రిడ్‌ను పట్టించాలి. వరిలో తడిలో అయితే కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజంను కలిపి నీళ్లలో 24 గంటలు నానబెట్టి మండెకట్టుకోవాలి. పొడిలో అయితే కిలో విత్తనానికి 4 గ్రాముల కార్బండిజంను కలపాలి. మొక్కజొన్నలో కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్‌ను పట్టించాలి. పెసర, మినుముకు 1కిలోకు 2.5 గ్రాముల థైరం పట్టించి 30 గ్రాముల కార్బోసల్ఫాన్ కూడా పట్టించాలి.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి



రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండేలా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు సూచిస్తున్నాం. నిరంతర తనిఖీల ద్వారా నకిలీ విత్తన విక్రయాలను అరికడుతున్నాం. సాగులో సాంకేతికత పాటించేలా రైతులకు ఎప్పటికప్పుడు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. అనుమతిలేని వ్యక్తులు విత్తనాలు, ఎరువులు విక్రయించకుండా పూర్తిస్థాయిలో నిలువరించాం. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టడంతో రైతులు కూడా వ్యవసాయశాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలి.

– సతీష్, ఏఓ, ఇల్లెందు మండలం

సమ్మె నోటీసు అందజేసిన కార్మికులు


సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

సుజాతనగర్: మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 6 నుంచి విధులను బహిష్కరించి సమ్మెలోకి దిగుతున్నట్లు పంచాయతీ కార్మికులు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీఓ వెంకటలక్ష్మికి శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. జీపీ కార్మికులను పర్మనెంట్ చేసి పీఆర్‌సీఓ పేర్కొన్న ప్రకారంగా పంచాయతీ సిబ్బందికి రూ.19 వేలు చెల్లించాలని, ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పంచాయతీలలో ఆదాయమున్న చోట వేతనాల పెంపునకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు కాంతారావు, లక్ష్మణ్, శివ, కృష్ణారావు, రమేష్, బాలు తదితులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడు పట్టాలివ్వాలి

పాల్వంచరూరల్: పోడు సాగుదారులందరికీ కుర్చీ వేసుకుని పట్టాలిప్పిస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ కొంతమందికి రైతులకు మాత్రమే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని సీపీఐ(ఎంఎల్) భద్రాచలం డివిజన్ కార్యదర్శి గొని ఐలయ్య అన్నారు. రెడ్డిగూడెం, కిన్నెరసాని గ్రామాల్లో అక్రమంగా అరెస్టులు చేసిన ఎన్డీ, ఏకేఎంఎస్ నాయకులను విడుదల చేయాలని శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అర్హులందరికీ పట్టాలు ఇవ్వకపోతే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరమళ్ల ఉమ, మల్లయ్య, వినోద, అల్లిశ్రీను, నాగమణి, కుమారి, మంగతాయి, రమ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐలయ్య

ఇంటి స్థలాలు ఇచ్చేదాకా పోరాటం


తహసీల్‌ను ముట్టడించిన ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

జూలూరుపాడు: ఇళ్లు, ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య అన్నారు. పేదలకు ఇంటి స్థలం చూపెట్టే దమ్ము మాకు ఉంది.. ఇచ్చే దమ్ము బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఉందా.. అని ప్రశ్నించారు. స్థలం ఉన్న ప్రతి పేదవాడికి డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలని, స్థలం లేని పేదలకు ప్రభుత్వమే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జూలూరుపాడు సీపీఎం కార్యాలయం నుంచి స్థానిక తహసీల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి, ముట్టడి చేశారు. ఐలయ్య మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్లు, సొంత ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనేక మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతి ఆ భూమిని పేదలకు పంచి పెడతామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలను కొంతమంది అక్రమార్కులు బెదిరించే ప్రయత్నాలు చేస్తున్నారని అది మానుకోవాలన్నారు. పేదల కోసం జైలుకు వెళ్లటానికైనా సిద్ధమన్నారు. పోడు కొట్టిన ప్రతి ఒక్కరికీ పట్టా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యాసా నరేష్, గడిదేసి కనకరత్నం, బానోత్ ఇస్రా, లకావత్ శ్రీను, పద్దం సుగుణ, తాటి పద్మ, బానోత్ మధు, గార్లపాటి వెంకటి, వల్లమల చందర్‌రావు, గార్లపాటి పవన్ కుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.

జనగర్జన సభను విజయవంతం చేద్దాం..

ఈనెల 2న ఖమ్మంలో జరగనున్న తెలంగాణ జన గర్జన, పీపుల్స్ మార్చ్ ముగింపు సభలకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంరూరల్: మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ


ఇల్లెందులో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య


టేకులపల్లిలో మాట్లాడుతున్న మంగీలాల్

కేసులు నమోదు

పాల్వంచరూరల్: భూవివాదంపై శుక్రవారం కేసు నమోదయింది. వివరాలు.. పునుకుల గ్రామానికి చెందిన బొల్లం యలమచ్చి ఇంట్లో నిద్రిస్తుండగా రాములు, లింగయ్య, మహేష్, జీవన్‌లు కలిసి ఇనుపరాడ్లతో ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశారని బొల్లం లింగరాజు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

జగన్నాథపురం గ్రామంలో..

గురువారం రాత్రి భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అద్దాలను స్థానికులు ధ్వంసం చేశారు. ఈ మేరకు డ్రైవర్ వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు సాయి, చరణ్‌లపై కేసు నమోదు చేశారు.

కారుతో ఢీకొట్టేందుకు ప్రయత్నించాడని..

కొత్తగూడెంలోని మేదర్ బస్తీలో నివాసం ఉంటూ జూలూరుపాడు హైస్కూల్లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.లక్ష్మీనర్సు ఈనెల 27న పుల్లాయిగూడెం వచ్చివెళ్తుండగా వరసకు అల్లుడైన ప్రసాద్ తనను కారుతో ఢీకొట్టి చంపాలని ప్రయత్నించాడని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ముందస్తు అరెస్టులు

ఇల్లెందు: అటు మంత్రుల పర్యటన, ఇటు ప్రగతి భవన్ ముట్టడి సందర్భంగా శుక్రవారం ముందస్తుగా పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. ప్రగతి భవన్ ముట్టడికి వెళ్లకుండా ఇల్లెందులో తుడుందెబ్బ నేతలు ఈసం నర్సింహారావు, రమణాల లక్ష్మయ్యలను అరెస్టు చేయగా.. అటు ఎన్డీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావును పోడు పట్టాలు పంపిణీ కోసం జిల్లాకు మంత్రులు విచ్చేస్తున్నందున ముందస్తుగా అరెస్టు చేసి విడుదల చేశారు.

టేకులపల్లి: జిల్లా కేంద్రంలో శుక్రవారం పోడు పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు హాజరవుతుండటంతో పోలీసులు పలువురిని ముందస్తు అరెస్టు చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ (చంద్రన్న) మండల కార్యదర్శి బాణోత్ ఊక్లా నాయక్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారిని తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వదిలేశారు. పోడు భూమి పట్టాల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న ప్రజా నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని న్యూడెమోక్రసీ నేతలు ప్రసాద్, భానుచందర్ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు.

సుజాతనగర్: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కొమరం బుచ్చయ్య దొర అన్నారు. రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు అవినీతి అక్రమాలకు నిరసనగా ప్రగతి భవన్ ముట్టడికి వెళ్తున్న నాయకులను స్థానిక పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. నాయకులు మాట్లాడుతూ.. ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్న గడలను ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జానకీరాం, మూడు రాందాస్ నాయక్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పోడుభూముల పంపిణీ సందర్భంగా బంద్రుగొండేనికి చెందిన సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబును శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి సొంతపూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆనందోత్సాహాల్లో పోడు రైతులు

టేకులపల్లి: తొమ్మిదేళ్లుగా పోడు పట్టాల కోసం ఎదురు చూసిన రైతులకు ఎట్టకేలకు పోడు పట్టాలు పంపిణీ చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 18,915 ఎకరాలకు గాను 5,523 మందికి పోడు పట్టాలు మంజూరయ్యాయి. శుక్రవారం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ కుమార్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, కలెక్టర్ అనుదీప్ చేతుల మీదుగా పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. టేకులపల్లి మండలంలో 245 మంది లబ్ధిదారులు పట్టాలు అందుకున్నారు. మిగిలిన 5,278 మందికి మండలంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.


పోడు పట్టాలు పొందిన లబ్ధిదారులు

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

సుజాతనగర్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్‌లో 4, 5వ తరగతి ప్రవేశాలకు మండల స్థాయి ఎంపికల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి జుంకీలాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3న సుజాతనగర్ జెడ్పీఎస్ఎస్ స్కూల్‌లో జరిగే ఎంపికలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 8008007153, 9849854162 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

టేకులపల్లి: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్, హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్ లో 4, 5వ తరగతి ప్రవేశాలకు మండల స్థాయి ఎంపికలు జూలై 4న టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించబడతాయని మండల విద్యాశాఖ అధికారి ఠాకూర్ రామ్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌ఫొటోస్, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్సుతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9908601846, 9951274678 నంబర్లలో తెలుసుకోవాలని పేర్కొన్నారు.

బస్సులు ఇవ్వకపోవడం దారుణం..


ఆర్టీసీ డిపో ఎదుట బైఠాయించిన కోరం కనకయ్య, కాంగ్రెస్ నాయకులు

చుంచుపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూలై 2న ఖమ్మంలో నిర్వహించనున్న తెలంగాణ జనగర్జన సభకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు ఇవ్వకపోవడం దుర్మార్గమని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆరోపించారు. శుక్రవారం పొంగులేటి అనుచరులతో ఆయన కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావును కలిసి సభకు బస్సులు కేటాయించాలని కోరగా, బస్సులు అందుబాటులో లేవని డీఎం తెలిపారు. దీంతో పొంగులేటి అనుచరులతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ గేటు వద్ద కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. కనకయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ సభ నిమిత్తం అద్దె ప్రాతిపదికన 100 బస్సులు అడిగామని దానికి అధికార పార్టీ నాయకులు రాజకీయంగా కుట్ర పన్ని అధికారులను కట్టడి చేశారని ఆరోపించారు. ఆర్టీసీ బస్సులను ఎవరైనా అద్దెకు తీసుకోవచ్చని, నేడు బస్సులను కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు బస్సుల ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ తెలంగాణ జనగర్జన సభకు స్వచ్ఛందంగా ప్రజలు, కాంగ్రెస్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఊకంటి గోపాలరావు, ఆళ్ల మురళి, పొంగులేటి అభిమానులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ సర్కార్ విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలు గడిచినా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించలేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు న్యాయమైన డిమాండ్ల సాధనకై సమ్మె చేస్తుంటే వారితో కనీసం చర్చలు జరిపేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలన్నారు. అఖిల్, విజయ్, అనిల్, గణేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛ పక్వాడా

సింగరేణి(కొత్తగూడెం): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సింగరేణి వ్యాప్తంగా ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు 15 రోజుల పాటు స్వచ్ఛ పక్వాడా ముగిసింది. కొత్తగూడెం ఏరియాలో శుక్రవారం రుద్రంపూర్‌లో ఏరియా జీఎం శాలేంరాజు ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వివిధ పాఠశాలల విద్యార్థులు, రుద్రంపూర్ ప్రాంత ప్రజలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం మాట్లాడుతూ.. తమ కార్యాలయాల్లో ఏరోజు చెత్త ఆరోజే క్లీన్ చేసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్ బ్యాగులు వాడాలని చెప్పారు. అధికారులు స్వచ్ఛ పక్వాడా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏరియా ఇంజనీర్ రఘురామిరెడ్డి, ఏజీఎం పర్సనల్ సామ్యుల్ సుధాకర్, డీజీఎం (ఐఈ) యోహాన్, ఎస్టేట్ ఆఫీసర్ తావుర్యా, శేషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

సమాలోచనల్లో ఇల్లెందు కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ కౌన్సిలర్లకు జూలై 2 గీటురాయిగా మారింది. ఏడాది కాలంగా చైర్మన్ డీవీకి వ్యతిరేకంగా పోరాడుతున్న అధికార పక్ష కౌన్సిలర్లు ఎమ్మెల్యే హరిప్రియ వెంట ఉండాలా లేదంటే పొంగులేటి శిబిరంలోకి వెళ్లాలా అన్న అంశంపై సమాలోచనలు చేస్తున్నారు. తాజాగా శుక్రవారం రాత్రి పట్టణంలోని ఓ కౌన్సిలర్ ఇంట్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఒకరోజు ముందుగానే అందరికీ సమాచారం చేరవేసుకున్నారు. వారం రోజుల క్రితం కూడా ఓ చోట సమావేశమయ్యారు. పొంగులేటితో కలిసి నడవాలని, అప్పుడే తొందర పడొద్దని తర్జనభర్జన పడినట్లు తెలిసింది. ఏడాది కాలంగా చైర్మన్ డీవీకి వ్యతిరేకంగా అధికార పాలక వర్గంలోని మెజార్టీ కౌన్సిలర్లు పోరాడుతున్నారు. అవిశ్వాస తీర్మానం కోసం విశ్వప్రయత్నం చేశారు. అంతిమంగా అటు కోర్టుకు ఇటు అధినాయత్వం వద్దకు చేరారు. అయితే కోర్టు పెండింగ్‌లో ఉంచటం, అధినాయకత్వం కోర్టును సాకుగా చూపటంతో వారి డిమాండ్ పరిష్కరించే అవకాశాలు సన్నగిల్లాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యలు రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక ఖాయం కావటంతో ఆయన వెంట వెళ్లాలని ఓ వర్గం పట్టుపడుతోంది. కొంతమంది మాత్రం పార్టీ మారకుండా వేచి చూద్దాం అంటున్నారు. ఇల్లెందు మున్సిపల్ పాలక వర్గంలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా సీపీఐ, ఎన్డీ నుంచి ఒక్కొక్కరు, ఇండిపెండెంట్‌గా మడత రమ ఉన్నారు. 21 మంది అధికారపక్షం వెంట ఉన్నారు. అందులో 14 మంది ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారు. అంతా ఓ చోట చేరి సమాలోచనలు చేస్తూ కీలక నిర్ణయం కోసం దీర్ఘాలోచనలో ఉన్నారు. మెజార్టీ కౌన్సిలర్లు పార్టీ మారే నిర్ణయం తీసుకుంటే ఆ ప్రభావం అధికార పార్టీకి తీరని నష్టం తెచ్చే అవకాశం ఉంటుందని చర్చ జరుగుతోంది.

నేడు లేబర్ ఆఫీసు ఎదుట ధర్నా



మాట్లాడుతున్న నబీ

ఇల్లెందు: సీఐటీయూ ఆధ్వర్యంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేజ్‌బోర్డు పరిరక్షణ కోసం లేబర్ ఆఫీస్‌ల ఎదుట జూలై1న జరగనున్న ధర్నాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్‌ఏ నబీ కోరారు.

శుక్రవారం ఇల్లెందులో అడ్డా కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో టి.కృష్ణ, కామనాగరాజు, మహమూద్, లక్ష్మణ్‌పాసీ, సామ్యా నాయక్, కటకం రాజయ్య, సుగుణ, సత్యనారాయణ కోరీ, వెంకటేశ్వర్లు, సామేలు, స్వామి, రామన్న, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాదయాత్ర

ఇల్లెందురూరల్: అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 10న అంగన్‌వాడీ కోర్కెల దినం సందర్భంగా నిర్వహిస్తున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబి, వెంకటమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అంగనవాడీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పాల్వంచ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహిస్తున్న పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. తాళ్లూరి కృష్ణ, చింతా రాంబాయి, కల్లేపల్లి మరియా, ఫాతిమా, ఆలేటి సంధ్య, యాకమ్మ, వెంకమ్మ, అలివేలు, మంగ, అంజమ్మ, శ్రీలత, పద్మ, ఉమాబాయి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.